క్లుప్తంగా

ఆర్థికసాయం



కన్నాయిగూడెం : మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన గావిడి నాగబాబుకుమార్ అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రులో చికిత్స పొందుతున్నాడు. కాగా వైద్య ఖర్చులకు దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని వాట్సప్ గ్రూప్‌లో కోరగా, ముప్పనపల్లి సహాయ నిధి గ్రూపు సభ్యుడు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో స్పందించి నాగబాబుకు శనివారం రూ.20 వేల నగదును ఆస్పత్రిలో అందజేశారు. ఈకార్యక్రమంలో ఎండీ ఫైజోద్దీన్, ప్రకాశ్, ఎండీ. ఎజాజ్, అకినపల్లి రవి తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి..

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలిలో దివ్యాంగుడు లక్క నర్సింగం ఇప్పటికే ఓ కాలు లేకఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండో కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో 'ఉబుంటు' సేవా సంస్థ వారు రూ.5వేల సాయం చేయగా శనివారం ఆ మొత్తాన్ని సర్పంచ్ మొగసాని నాగదేవతసంపత్, సంస్థ ప్రతినిధి కర్ణకంటి రాంమూర్తి, కోటేశ్వర్, శిరీష, బాబూరావు, మండల శ్రీను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రవళిక ఆత్మహత్య బాధాకరం

శాయంపేట : గ్రూప్‌- 2 అభ్యర్థిని మర్రి ప్రవళిక ఆత్మహత్య బాధాకరమని బీఎస్‌పీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ శనివారం ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా బికాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ వాయిదా వేయడం మూలంగా నిరాశకు లోనై సూసైడ్ నోట్ రాసుకొని ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక మరణానికి రాష్ట్ర ప్రభుత్వామే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నియామకం



పర్వతాల రమేశ్

ఏటూరునాగారం : బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా పర్వతాల రమేశ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, బడే నాగజ్యోతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్టీలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. తనపై నమ్మకంతో మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు లక్ష్మీనర్సింహరావుకు, నాగజ్యోతికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ మండల యూత్ కమిటీ..

నల్లబెల్లి : భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) యూత్ మండల అధ్యక్షుడిగా శనిగరం గ్రామానికి చెందిన డ్యాగల రాజేష్(కృష్ణ)ను నియమించినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా అనుశెట్టి వినోద్, కొలిపాక రంజిత్, ప్రధాన కార్యదర్శిగా గన్నారపు అఖిల్, సహాయ కార్యదర్శులుగా మల్యాల ప్రశాంత్, అల్లాపురపు అనిల్, ప్రచార కార్యదర్శిగా ఊరటి సాయిరాజ్, కార్యవర్గ సభ్యులను నియమించారు.

కాంగ్రెస్ యూత్ గ్రామ కమిటీ ఎన్నిక

గూడూరు : గ్రామాల్లో యూత్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్ అన్నారు. మండలంలోని భూపతిపేట, చిన్న ఎల్లాపురం గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ గ్రామ యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. భూపతిపేట అధ్యక్షుడిగా ఎల్లబోయిన కార్తీక్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌గౌడ్, కార్యదర్శి ఎస్కే. షాబీర్, సహాయ కార్యదర్శి సతీష్, కోశాధికారి సురేష్, చిన్న ఎల్లాపురం అధ్యక్షుడిగా ఆవుల మహేష్, ఉపాధ్యక్షులు యాకూబ్, రాజ్‌కుమార్, కార్యదర్శి వీరన్న, సహాయ కార్యదర్శి కిషన్, కోశాధికారి హట్టిని ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కొత్తగూడ: మండలంలోని జంగవానిగూడెం సర్పంచ్ ఈసం స్వామి, ఉప సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌లు శనివారం ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

17న ఓంకార్ వర్ధంతి సభ

గీసుకొండ : మచ్చాపూర్‌లోని ఓంకార్ స్మారక స్థూపం వద్ద ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 17న 'మనువాదం-రాజ్యాంగం' అనే అంశంపై సభను నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి తెలిపారు. శనివారం సభకు సంబంధించిన కరపత్రాలను స్థూపం వద్ద విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు కంకనాల మల్లికార్జున్, కందికొండ కుమారస్వామి, బండి బుచ్చయ్య, ఆదినారాయణ , గూడ సాయిరాం, రాజు, సురేశ్, చారి తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు



వెంకటాపురం(ఎం): పోచమ్మ ఆలయం వద్ద..



మంగపేట: కమలాపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తీరొక్క పూల పండుగ

ఊరూరా ఎంగిలిపూల బతుకమ్మ సందడి



మంగపేట: బొడ్రాయి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు





బతుకమ్మతో చిన్నారులు





బతుకమ్మతో మహిళలు

ములుగు రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శనివారం అశ్వయుజ మాస భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ పండుగ వాతావరణం నెలకొననుంది. మహిళలు స్నానాలు ఆచరించి ఉదయమే తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ బతుకమ్మ ఆట స్థలాలకు మహిళలు, చిన్నారులు బతుకమ్మలతో బయలుదేరి వెళ్లారు. అనంతరం బతుకమ్మ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. వేడుకలకు పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఎస్సై ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మండలంలోని పలు గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు నూతన వస్త్రాలను ధరించి బతుకమ్మలు ఆడేందుకు మండల కేంద్రంలోని రామాలయం, బొడ్రాయి, ఓడవాడ, రజకవాడ, క్రాస్‌రోడ్డు, రొయ్యూర్, శంకరాజుపల్లి, రాంనగర్, రామన్నగూడెం ప్రాంతాల్లో వేడుకలను జరుపుకున్నారు. బతుకమ్మ ఆడేందుకు ఆయా నిర్వాహకులు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు, డీజే సౌండ్స్‌ను ఏర్పాటు చేశారు. రామాలయం వద్ద చైర్మన్ మోడెం రమేశ్, పెండ్యాల సంతోష్, కొండల్, చందు, మనోహర్, శ్రీనివాస్, సదానందం, బ్రహ్మం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే బొడ్రాయి వద్ద పోగుల లక్ష్మీనారాయణ, కత్తెర శ్రీను, నూతి రమేశ్, కుమార్, వెన్న సతీష్, జయంత్, వెంకట్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు షురూ

వెంకటాపురం(ఎం) : మండలంలోని పలు గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే మహిళలు, చిన్నారులు తంగేడు, గునుగు, టేకు, తామరపూలతో పాటు వివిధ రకాల పూలను సేకరించారు. ఇంట్లో బతుకమ్మలను అందంగా పేర్చుకుంటూ సంబరపడ్డారు. సాయంత్రం వేళ గ్రామాల్లోని ఆలయాల్లో బతుకమ్మ ఆటలాడుతూ ఆనందంగా గడిపారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

మంగపేట : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సందడి శనివారం ప్రారంభమైంది. ఊరూరా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను కొలువు దీర్చి చల్లంగా చూడాలని కోరుకుంటు మహిళలు, యువతులు పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మను ఎత్తుకుని మంగళ వాయిద్యాలతో ఆయా గ్రామాల్లోని దేవాలయాల ప్రాంగణాలు, ముఖ్య కూడళ్లు, చెరువుల వద్దకు చేరుకుని వలయాకారంలో తిరుగుతో చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో డీజే సౌండ్స్ బతుకమ్మ పాటలతో పల్లెలు హోరెత్తాయి.



మంగపేట: బతుకమ్మ పేర్చుతున్న ఆదివాసీ మహిళలు



ఏటూరునాగారం: రామాలయంలో..



మంగపేట: బతుకమ్మ పేర్చుతున్న మహిళలు



ఏటూరునాగారం: బొడ్రాయి వద్ద..

దేవీ శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

ములుగు రూరల్ : ములుగులో దేవీ శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలకు మండపం, స్వాగత తోరణాలను పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 23వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7గంటలకు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతాయని అన్నారు. అమ్మవారు తొమ్మిది రోజుల్లో రోజుకో అవతారంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నిత్య అన్నదాన కార్యక్రమంలో మధ్యాహ్నం 1గంటకు ప్రారంభం అవుతుందని అన్నారు. 23వ తేదీన ఉదయం 11 గంటలను నిమజ్జన ఉంటుందని తెలిపారు.

బతుకమ్మ గద్దె వద్ద గౌరీ పూజ



వాజేడు: గౌరీ పూజ చేస్తున్న మహిళలు

వాజేడు : మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో శనివారం బతుకమ్మ గద్దె వద్ద మహిళలు గౌరీ పూజ చేశారు. బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని అర్చకులు సౌమిత్రి వేణుగోపాలచార్యులు మహిళల చేత గౌరీ పూజను చేయించారు. అనంతరం తులసి మొక్క నాటారు.

పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన దొడ్డిపాటి శంకర్ శనివారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మునిసపల్లి కుమార్ గౌడ్ పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి ఉన్నారు.

ఇసుక వాహనాలు సీజ్

చెన్నారావుపేట: అనుమతులు లేకుండా ఇసుక విక్రయిస్తున్న ఇసుక వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ కల్లెడ శివారులోని ఆకేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించామని, ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లు పంపిణీ చేసి మాట్లాడుతున్న వైద్యులు

వాజేడు : మండల పరిధిలోని మొరుమూరు గ్రామంలో శనివారం గర్భిణులకు పోషకాహార కిట్లను కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారి మధుకర్ పంపిణీ చేశారు. అనంతరం మధుకర్ మాట్లాడుతూ..గర్భిణులు విటమిన్లు, ఐరన్ టాబ్లెట్లు తీసుకోవాలన్నారు. పోషక విలువలు ఉన్న ఆకు కూరలు తినాలని తెలిపారు. సరైన ఆహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. నీళ్లు ఎక్కువగా తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, ఏఎన్ఎం రాజేశ్వరి, సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, వెంకటాపురం(కె), వాజేడు మండలాల కోఆర్డినేటర్లు హనుమంత్, కామేష్, సిబ్బంది ప్రశాంత్, నరేష్, స్వరూప, ఇందిర, పద్మ, ఉష, రమాదేవి, భాస్కర్, ప్రసాద్, సుజనతో పాటు తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ ఇండస్ట్రియల్ టూర్‌కు విద్యార్థులు



యాదాద్రి నర్సింహస్వామి దేవాలయం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 8, 9, 10వ తరగతి చదువుతున్న 50మంది విద్యార్థులను హనుమకొండలోని సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇండస్ట్రియల్ టూర్‌కు తీసుకెళ్లారు. సొసైటీ ఖర్చులతో చందన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హనుమకొండలోని కొన్ని చారిత్రక ప్రదేశాలతోపాటు యాదాద్రి ఆలయం, హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, సాలర్జంగ్ మ్యూజియం, బిర్లామందిర్ లాంటి చారిత్రక ప్రదేశాలను దర్శిస్తూ శనివారం టూర్ కొనసాగించారు. దీంతో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ సొసైటీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యం



నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో దొంతి మాధవరెడ్డి

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే బడుగు, బలహీన వర్గల అభివృద్ధి సాధ్యమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని బోల్లోనిపల్లి, అర్షనపల్లి గ్రామాలకు చెందిన రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పాలుదాసరి రమేష్, బిక్కునూరి మౌనిక సుమన్, గాజర్ల అనూష అశోక్‌లతోపాటు పలువురు మాధవ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా మాధవ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చిట్యాల తిరుపతి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు తుంగలో తొక్కారు

ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. ఈ మేరకు మండలంలోని కీర్యతండాలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్, సారంగపాణి, రవి, మోహన్, ఈర్య, స్వామి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల'పై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మహాముత్తారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం కల్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని గ్రామస్తులకు సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, టీపీసీసీ మెంబర్ బెల్లంకొండ కిష్టయ్య, ఎంపీటీసీ తోలెం వెంకటేష్, నాయకులు లింగమల్ల దుర్గయ్య, రవి, వంశీరాజ్, రామోజీతో పాటు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాటారం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టి ఆమోదమయ్యేలా చూడాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నస్తూర్‌పల్లి నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అనుకూలం అని చెప్పిన బీజేపీ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మాదిగల చేతిలో బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ కాటారం సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి, ఎమ్మెస్పీ మల్హర్ మండలం అధ్యక్షుడు కేశారపు నరేశ్, నాయకులు మంతెన రాకేశ్, శేఖర్, అరవింద్, శ్రీధర్ పాల్గొన్నారు.

'నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం'

చెన్నారావుపేట: నిరుద్యోగ యువతతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అన్నారు. ఆమె కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. నోటిఫికేషన్ల రద్దు.. పేపర్ లీకేజీల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మంద యాకయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేష్, మంచాల సదయ్య, రమేష్ యాదవ్, ఇంద్రసేనారెడ్డి, అమిరోద్దిన్, సర్పంచ్ తూటి పావని, రమేష్, బండి హరీశ్, రాజేందర్, సారయ్య ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వెంకటాపురం(కె) : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెంకవాగు, లక్ష్మీపురం, రామచంద్రాపురం గ్రామాల్లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, దోమ తెరల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

'దేవుడి పేరుతో రాజకీయం సరికాదు'



మాట్లాడుతున్న తిరుపతి

చిట్యాల: దేవుడి పేరుతో ప్రజలకు బహుమానాలు ఇస్తూ ఎమ్మెల్యే ఓట్ల రాజకీయం చేయడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి గుడి నిర్మాణం పేరుతో కోట్లాది రూపాయాలను వసూలు చేశారాని ఆరోపించారు. నిరుపేదలకు చేందాల్సిన భూమిలో గుడి ఏర్పాటు చేయడం ఓట్ల రాజకీయంలో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, అనిల్, శంకర్ గౌడ్, రవి, కొంరయ్య, కుమార్, రమేష్, నాగరాజు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుబడిన గుడుంబా సామగ్రితో పోలీసులు

కాటారం: కాటారం మండలం గంగారంలోని గుడుంబా స్థావరాలపై శనివారం సివిల్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేసి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇళ్ల పరిసరాలు, పొలాల వద్ద పలువురు తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలను గుర్తించారు. ఈ దాడుల్లో 28 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకొని సుమారు 1500 లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు సివిల్, ఎక్సైజ్ ఎస్సైలు అభినవ్, గంగాధర్ తెలిపారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుడుంబా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరం అని ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.